ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

ఆదివారం 7 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ - ఆదివారం
సాయంత్రం - 6:36

సహర్ - సోమవారం
ఉదయం - 4:42



సభకు హాజరైన జనం

జన జాతర

తుక్కుగూడ సభకు పోటెత్తిన జనం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ శనివారం తుక్కుగూడలో నిర్వహించిన 'జనజాతర' బహిరంగ సభ విజయవంతమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు లక్షలాదిగా తరలివచ్చారు. దీంతో తుక్కుగూడలో ఎక్కడ చూసినా జనసందడే కనిపించింది. అశేషజనం తరలిరావడంతో తుక్కుగూడ రోడ్లన్నీ జనసంద్రాన్ని తలపించాయి. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సభా వేదికకు వచ్చే సమయానికే ప్రాంగణం జనంతో కిక్కిరిసింది. దీంతో రోడ్ల మీదే వేలాదిగా జనం ఉండిపోయారు. పార్టీ జాతీయ మేనిఫెస్టో తెలుగు ప్రతిని రాజీవ్ గాంధీ సభా ప్రాంగణం వేదిక నుంచే రాహుల్ గాంధీ విడుదల చేశారు. సభకు అంచనాలకు తగ్గట్టుగా జనం హాజరుకావడంతో కాంగ్రెస్ నేతలు సంబరపడుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించిన కాంగ్రెస్

- హాజరైన అగ్రనేతలు ఖర్గే, రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి
- జాతీయ మేనిఫెస్టో విడుదల
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- ఉత్సాహాన్ని నింపిన నేతల ప్రసంగాలు

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం/ఇబ్రహీంపట్నం/మొయినాబాద్/షాద్‌నగర్, ఏప్రిల్ 6 : రంగారెడ్డిజిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర భారీ బహిరంగ సభ విజయవంతమైంది. ఈ సభకు జనం జేజేలు పలికారు. రాష్ట్రం నలుమూలల నుంచి తండోప తండాలుగా తరలివచ్చారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కావడంతో ప్రత్యేకత సంతరించుకుంది. ఆయనతో పాటు పలువురు జాతీయ నేతలు, ఇతర రాష్ట్రాల ముఖ్యనాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు పాల్గొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు తుక్కుగూడలో జరిగిన సభలోనే ఆ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ఈ గ్యారంటీలకు ప్రజల్లో మంచి స్పందన రావడంతో పాటు, పార్టీ అధికారంలోకి వచ్చింది. అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ.. లోక్‌సభ ఎన్నికల శంఖరావాన్ని పూరించింది. ఇక్కడి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. ఈనెల 5న పార్టీ జాతీయ మేనిఫెస్టో ఢిల్లీలో సోనియా, ఖర్గే, రాహుల్ విడుదల చేశారు. అందుకు సంబంధించి తెలుగుప్రతిని

మిగతా 7వ పేజీలో ...





జనజాతర సభకు తరలుతున్న కార్యకర్తలు

కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడలో జనజాతర సభ జరపడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో కేసీఆ



కాంగ్రెస్ చెప్పిందే చేస్తుంది

బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత

కాంగ్రెస్ చెప్పిందే చేస్తుందని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీని కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు హేళన చేస్తున్నారని, పదేళ్ల దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఏమి చేశారని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు లేనిపోని మాటలు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. జనజాతర సభ ద్వారా దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.




సభకు వస్తున్న మహిళలు

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే అభివృద్ధి వెనక్కి : మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి



కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలని మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ పాలనలో కార్యకర్తలు ఎన్నో అవమానాలు భరించారన్నారు. మల్కాజిగిరి ప్రజలను కోరేది ఏమిటంటే.. నన్ను నాన్‌లోకల్ అంటున్నారు. నేను నాన్‌లోకల్ కాదు.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నాను. వేల కోట్లతో జిల్లాను అభివృద్ధి చేశానని చెప్పారు. 2006లో నేను చేసిన అభివృద్ధి ఎంతో ఉందన్నారు. ఒక్కసారి అవకాశమివ్వాలని, అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తాని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయకుంటే.. అభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్తుందన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి : చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



మరోసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్దపీట వేస్తానని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. 75ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత పేదల సంక్షేమం గురించి ఆలోచించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. పేదల సంక్షేమం వద్దూ.. కార్పొరేట్ సంక్షేమం ముద్దు అని బీజేపీ అంటుందని తెలిపారు. చేవెళ్ల గడ్డపై కూరగాయల నుంచి సాఫ్ట్‌వేర్ వరకు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. మరోసారి మీ ముందు నిలబడ్డా.. ఎంపీగా గెలిపించాలని కోరారు.

14 ఎంపీ సీట్లు సోనియమ్మకు బహుమతిగా ఇద్దాం : మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

ర్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇన్నాళ్లు ఫాంహౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు మళ్లీ ఎంపీ ఎన్నికలు రావడంతో రైతులు గుర్తుకు వచ్చారని విమర్శించారు. తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీలో గెలిపించాలని కోరారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ లేకుండా పోతుందన్నారు. మాటిస్తే.. మడమ తిప్పం... ఆరు గ్యారంటీలు ఇచ్చాం.. అమలు చేస్తున్నాం. తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిపించి సోనియమ్మకు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు.



కాంగ్రెస్‌తోనే సెక్యులరిజం సాధ్యం : మాజీ మంత్రి షబ్బీర్ అలీ



కాంగ్రెస్‌లో సెక్యులరిజం సాధ్యమని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. దేశంలో సెక్యులరిజం కాపాడేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో మత విద్వేషాలను రెచ్చగొట్టారని, వాటిని రాహుల్ పాదయాత్ర ద్వారా రూపుమాపారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను బీజేపీ తుంగలో తొక్కిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ముస్లింలకు రక్షణ ఉంటుందన్నారు.

విర్రవీగుతున్న కేసీఆర్‌కు బుద్ధి చెప్పారు : భువనగిరి ఎంపీ అభ్యర్థి శ్యామల కిరణ్‌కుమార్‌రెడ్డి



విర్రవీగుతున్న కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని భువనగిరి ఎంపీ అభ్యర్థి శ్యామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఎలా తరిమి కొట్టారో ఆలాగే ప్రధాని మోదీని తరిమి తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు. తెలంగాణలో 15 ఎంపీ స్థానాలను గెలుచుకోవాలని, బీఆర్ఎస్‌ను, బీజేపీని బొందపెట్టాలని పిలుపునిచ్చారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ విజయేంద్ర బోయ

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6 : తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీ విజయేంద్ర బోయ(ఐఏఎస్) అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ శశాంకతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంపీడీవోలతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ నీటి సమస్యపై ఎప్పటికప్పుడు ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట చేతిపంపులు, బోరు మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అవసరమైనచోట ట్యాంకర్లను వినియోగించాలని, మున్సిపల్ కార్యాలయాలకు, వాటర్ వర్క్స్ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలో టోల్‌ఫ్రీ, కాల్‌సెంటర్ నెంబర్లు అందరికీ తెలిసేలా ఏర్పాటు చేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో నీటి సరఫరా తీరును అనునిత్యం పర్యవేక్షణ జరపాలని, స్పెషల్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ.. ఎక్కడైనా లోపాలుంటే వెంటనే సరిదిద్దాలన్నారు. భగీరథ పథకం ద్వారా పూర్తిస్థాయిలో నిర్ణీత పరిమాణంలో నీటి సరఫరా జరుగుతోందా? లేదా? అనే విషయంపై దృష్టిసారించాలన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడితే.. కాల్‌సెంటర్ టోల్‌ఫ్రీ నెంబర్ 9347492260కు కాల్‌చేసి గానీ, వాట్సప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర బోయ

పాత్రికేయులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం : కలెక్టర్

పోలింగ్/కౌంటింగ్ కవరేజీ కోసం ఎలక్షన్ కమిషన్ ద్వారా మీడియా పాసులు(అథారిటీ లెటర్స్) పొందనున్న మీడియా ప్రతినిధులకు కూడా లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతించిందని కలెక్టర్ శశాంక తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 16 లోపు సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించే ఫారం-12(డీ) లను మాత్రమే పరిగణలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఫారం-12(డీ) దరఖాస్తులు నోడల్ అధికారి కార్యాలయంతో పాటు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, డీపీఆర్వో కార్యాలయం నుంచి పొందవచ్చని, ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకున్న పాత్రికేయులు సంబంధిత శాసన సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు.



నిరసనలో పాల్గొని మాట్లాడుతున్న సబితారెడ్డి

తక్షణమే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని, తక్షణమే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. రైతులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం బీఆర్ఎస్ నాయకులు రైతు దీక్షలు నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన నిర్వహించిన నిరసనలో సబిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధరకు బోనస్‌గా రూ.500 చెల్లించాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల ఆర్థికసాయం, మృతిచెందిన రైతుల కుంటుంబాలకు రూ.25లక్షల పరిహారం అందించాలని, 24 గంటల కరెంట్ ఇవ్వాలన్నారు. రేవంత్‌రెడ్డి రైతులు, ప్రజా సమస్యల వదలిపెట్టి ఇతర పార్టీల నేతలను పార్టీలో చేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారని ఎద్దేవా చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, షాబాద్, మొయినాబాద్ జెడ్పీటీసీలు అవినాష్‌రెడ్డి, శ్రీకాంత్, మండలాధ్యక్షులు ప్రభాకర్, నర్సింగ్‌రావు, గోపాల్, సీనియర్ నాయకులు అనంత్‌రెడ్డితో పాటు యాదగిరి, చంద్రశేఖర్, సాయినాథ్, బి.నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నీటి తొట్టె

కందుకూరులో 42.8 డిగ్రీలు

వికారాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లపైకి వచ్చేందుకు భయపడుతున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూరులో 42.8 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా తాండూరులో 42.7 , మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లిలో 42.6 డిగ్రీలు, యాలాలలో 42.5 డిగ్రీలు, పుట్టపహాడ్‌లో 42.4 డిగ్రీలు, బొంరాస్‌పేట్‌లో 42.2 డిగ్రీలు, కోట్‌పల్లిలో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పశుపక్ష్యాదులకూ 'నీటి తొట్లు'

వేసవిలో పశుపక్ష్యాదుల దప్పిక తీర్చడానికి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో నీటితొట్లను ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లతో పాటు నిర్జన ప్రదేశాల్లో మొత్తం 20చోట్ల పక్షులు, జంతువులు దప్పిక తీర్చుకోవడానికి తొట్లు ఏర్పాటు చేసినట్లు శనివారం మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్ తెలిపారు. ఇళ్ల (డాబాలు)పై కూడా పక్షుల కోసం నీటితొట్లను ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు.



మెడికల్ కాలేజీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మంజూరైన కొత్త మెడికల్ కాలేజీలో 32 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. డీఎంహెచ్‌వో రఘునాథస్వామి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఈనెల 6 నుంచి 8 వరకు డౌన్‌లోడు చేసుకుని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి పేర రూ.500లు డి.డి చెల్లించి అర్హత పత్రాలతో కలెక్టరేట్‌లో సమర్పించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

‘ఉపాధి’ కల్పనకు అవగాహన కల్పించాలి

తాండూరురూరల్, ఏప్రిల్ 6: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతులు, కూలీలకు ఉపాధి కల్పించేందుకు భాగస్వాములుగా చేయాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. తాండూరు మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం తాండూరు క్లస్టర్‌లోని బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల ఏపీవో, ఈసీ, టీఏలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీ రేటు రూ.272ల నుంచి రూ.300లకు ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ముఖ్యంగా కూలిరేటు పెరిగిన విషయమై గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని చెప్పారు. పెంచిన కూలీకి సమానంగా కొలతలు ఎలా తీసుకోవాలనే విషయమై సీసీలకు వివరించారు. ప్రస్తుతం ల్యాండ్ లెవలింగ్, చెరువు, కాల్వల పూడికతీత, ఫారంపాండ్స్ పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శెట్టి రవి, ఏపీవోలు నరోత్తంరెడ్డి, ఈసీలు మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, నర్సింహారెడ్డి, శ్రవణ్ గౌడ్, ఆయా మండలాల్లోని ఏపీవో, సీసీ, టీఏలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి కౌన్సిలర్ల రాజీనామా

శామీర్‌పేట, ఏప్రిల్ 6: మండలంలోని తూంకుంట మున్సిపాలిటీకి చెందిన చెందిన సింగిరెడ్డి జరిని వేణుగోపాల్‌రెడ్డి, గుంతల లక్ష్మీకృష్ణారెడ్డి, తాడెం ఆంజనేయులు, పాండులు, కొడిమెల ఉమాఆంజనేయులు శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈవిషయాన్ని తూంకుటలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన తమను పార్టీలో చేరిన పక్షంలో ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతానని మాజీ మంత్రి మల్లారెడ్డి హామీ మేరకు బీఆర్ఎస్ పార్టీ లో చేరామన్నారు. పార్టీలో చేరినా అభివృద్ధి పనులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేసారు. ఈ మేరకు తాము ఎమ్మెల్యే మల్లారెడ్డి తీరుకు నిరసనగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు వివరించారు.


మాట్లాడుతున్న డీకే.అరుణ

దేశరక్షణకు బీజేపీని గెలిపిద్దాం

కొడంగల్, ఏప్రిల్ 6: దేశరక్షణ కోసం మరోసారి బీజేపీని గెలిపించేందుకు ప్రతీఒక్కరు కలిసి రావాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే.అరుణ పిలుపునిచ్చారు. కొడంగల్‌లోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక అవినీతి అక్రమాలకు తావుఇవ్వకుండా పాలన కొనసాగుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్కాంలు, కుంభకోణాలతో దేశంలో అభద్రత భావానికి గురి చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలుపుతూ ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో బస్వరాజ్, బాబాయ్యానాయుడు, కుంద్రు నర్సింహులు, బంటు రమేశ్, బందెప్ప, సర్వేశ్వర్, భానుప్రకాశ్, రాకేశ్ పాల్గొన్నారు.


బ్రహోత్సవాలకు సిద్దమైన రామేశ్వర స్వామి ఆలయం

ఈనెల 9 నుంచి శ్రీ బుగ్గరామేశ్వర స్వామి బ్రహోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 6 : షాబాద్ మండల పరిధిలోని కొమరబండలో కొలువుదీరిన శ్రీ బుగ్గరామేశ్వర స్వామి బ్రహోత్సవాలు ఈనెల 9 నుంచి 17 వరకు నిర్వహించబోతున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న ధ్వజారోహణం, 10న రుద్రాభిషేకం, 11న అగ్నిగుండం, 12న పల్లకిసే, 13న రథోత్సవం, 14న శివనామస్మరణ, 15న పార్వతీపరమేశ్వరుల కల్యాణం, 16న దీపోత్సవం, 17న శివతీర్థము నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామి వారి బ్రహోత్సవాలను తిలకించడానికి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారని చెప్పారు.

నల్లా పైప్‌లకు ట్యాప్‌లు బిగించిన పంచాయతీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నీటి పైప్‌కు ట్యాప్ బిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలోని నల్లా పైపులకు పంచాయతీ సిబ్బంది శనివారం ట్యాపులను బిగించారు. నాగిరెడ్డిగూడ గ్రామంలో నల్లా పైపులకు ట్యాపులు లేక ‘వృథాగా రోడ్డుపై పారుతున్న తాగు నీరు’ అని శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి స్వప్న సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన నల్లా నీటి కనెక్షన్‌లకు ట్యాప్‌లను బిగించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంధ్య చెప్పారు.


లింగ బసవేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

భక్తి శ్రద్ధలతో లింగ బసవేశ్వరస్వామి జాతర

కొత్తూర్, ఏప్రిల్ 6 : కొత్తూర్ మండల పరిధిలోని కొడిచర్ల గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వరస్వామి జాతరను గిరిజనులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజల పాటు జరిగే జాతరలో మొదటి రోజు (శనివారం) మహాపూజలు, బోనాలు, బసవేశ్వరస్వామి కల్యాణం, అగ్నిగుండాలు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాతరలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మైఎం తండా మాజీ సర్పంచ్ అరుణరమేష్‌నాయక్, సేవియానాయక్, రాములునాయక్, హనుమంత్‌నాయక్, జంపు, హోని, వాలి, కేస్లు, నరేష్‌నాయక్, పాల్గొన్నారు.

జనజాతర!


సభకు తరలివస్తున్న జనం

(ఐదో పేజీ తరువాయి)

సభా వేదికపై అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నంప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి విడుదల చేశారు. వంద రోజుల్లో సాధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి సభలో వివరించారు. ప్రధాని మోదీ, కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అవినీతి అక్రమాలను ఎండగట్టారు. అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం పార్టీ శ్రేణులను ఆకట్టుకుంది. రాష్ట్రం నుంచి చిన్న పిల్లోడు పిలిచినా ఇక్కడికి వస్తానని రాహుల్ మాట ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు గట్టివార్నింగ్ ఇచ్చారు. పేదలకు డబుల్ బెడ్‌రూం కట్టిస్తానని మాట తప్పిన కేసీఆర్‌కు.. చెర్లపల్లి జైలులో డబుల్‌బెడ్ రూం ఇల్లు కట్టిస్తానంటూ హెచ్చరించారు.

14 ఎంపీ స్థానాలను గెలిపించుకోవాలి : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తెలంగాణలో 14 ఎంపీ స్థానాలను గెలిపించుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 17స్థానాల్లో 14 స్థానాలను గెలిపిస్తే.. అభివృద్ధి సాధ్యమని అన్నారు. తుక్కుగూడ సెంటిమెంటుగా మరోసారి కాంగ్రెస్ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్ల పాలనకు ఇక్కడ నుంచే ఫులిస్టాప్ పడిందని, ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని అన్నారు.

కేసీఆర్ గడీల పాలనను బద్దలు కొట్టాం: డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కేసీఆర్ గడీల పాలనను బద్దలు కొట్టామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. దేశంలో యువత కాంగ్రెస్ వైపు చూస్తోందన్నారు. బీజేపీ పాలన నుంచి విముక్తి కల్పించేందుకు తుక్కుగూడలో జనజాతర నిర్వహించామన్నారు. బీఆర్ఎస్ పాలన అంతమైందని, ఇక మిగిలింది బీజేపీయేనన్నారు. బీజేపీ మత వైఖరితో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందన్నారు. రాహుల్‌ను ప్రధానిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌కు దూరంగా ఉండండి : ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు దూరంగా ఉండాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. ఓ వైపు ప్రాంతీయ శక్తులు, మరో వైపు మత తత్వ శక్తులు సమాజాన్ని విభజించి రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి తప్పా ఏమీలేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, సానుభూతి పరులు దీక్షభూని, ప్రమాణం చేసి ఒక్కొక్కరు వంద ఓట్లు తీసుకువచ్చి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఆయన కోరారు.


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సభ సైడ్‌లైట్స్

ఇబ్రహీంపట్నం/ కందుకూర్/ మహేశ్వరం/ చౌదరిగూడ ఏప్రిల్ 6: తుక్కుగూడలో శనివారం సాయంత్రం జరిగిన జనజాతర సభకు ఎండను సైతం లెక్క చేయకుండా లక్షలాదిగా జనం తరలి వచ్చారు.

6:30 గంటలకు స్థానిక నాయకులతో జనజాతర సభ ప్రారంభమైంది. మొదటగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ప్రసంగించారు.
6:43 గంటలకు మంత్రి కొండా సురేఖ ప్రసంగించారు
6:48 గంటలకు మంత్రి సీతక్క ప్రసంగించారు
6:54 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్
7:00 గంటలకు మంత్రి జూపల్లి కృష్ణారావు
7:05 గంటలకు మంత్రి శ్రీధర్‌బాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా..
7:07గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, ఏఐసీసీప్రధాన కార్యదర్శి కేసీవేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవవరాలఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సభ వేదికపైకి వచ్చారు.
7:17 గంటలకు అఖిలభారత కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో విడుదల చేశారు.
7:20 గంటలకు రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని మొదలుపెట్టి 7:58 ముగించారు.
8:00 గంటలకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రసంగం ప్రారంభించి నిమిషంలోనే ముగించారు.
8:01 గంటలకు ఉప ముఖ్యమంత్రి మలు భట్టి విక్రమార్క ప్రసంగించారు.
8.08 గంటలకు మొదలైన సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించగా
8:27గంటలకు ప్రసంగం ముగించారు. దీంతో జన జాతర సభ ముగిసింది.

సభలో పోలీసుల భారీ బందోబస్తు

తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జన జాతర సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనటలు జరకుండా వేయి మంది పోలీస్ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు ఇది గాక సభా వేదిక నలుమూల కేంద్ర బలగాలచే భారీ భద్రత కొనసాగింది.

బీజేపీకి మత పిచ్చి పెరిగి పోతుంది : జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి

బీజేపీకి మత పిచ్చి పెరిగిపోతుందని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ మతం పేరుతో ముందు కెళ్తుందని, నిరుద్యోగం గురించి పట్టించుకోవడం లేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా గెలిపించుకోవాలని కోరారు. ప్రజలు ఆలోచించి ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు.

దైవకార్యాల్లో భాగస్వాములు కావాలి

» విద్యారణ్య భారతీస్వామి


మల్కాపూర్‌లో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న భక్తులు

చేవెళ్ల, ఏప్రిల్ 6: ప్రజలందరూ దైవకార్యాల్లో భాగస్వాములు కావాలని హంపీ విరుపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీస్వామి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ భువనేశ్వరీ సహిత పంచలింగేశ్వర, నవగ్రహ, పంచముఖి ఆంజనేయ స్వామి వార్ల దేవాలయ ద్వితీయ పుష్కర కుంభాబిషేకం మహోత్సవాలు మూడు రోజులు ఘనంగా జరిగాయి. శనివారం ముగింపు సందర్భంగా విద్యారణ్య భారతీస్వామి హాజరుకాగా ఆలయం కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘనస్వాగం పలికారు. హోమం పూర్తి అయ్యాక కలశంలోని నీటిని ఆలయం గోపురాలపై చల్లారు. అలాగే హోమంలో కూర్చున్న దంపతులను ఆశ్వీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవనామస్మరణ చేయాలన్నారు. దేవాలయం శివనామస్మరణతో మారుమోగింది. అక్కడకు వచ్చిన భక్తులందరి మూడు రోజులుగా అన్నదానాలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

పథకాల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

» బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 6: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా శనివారం మోమిన్‌పేట్ మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో చేపట్టిన పనులే ఇప్పుడు స్వాగతం పలుకుతున్నాయన్నారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా ఈప్రాంతంలో చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రజలకు గుర్తుండిపోయాయని తెలిపారు. ఎంపీ నిధులతో వికారాబాద్ నియోజకవర్గంలోని 400 గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ వాటి అమలులో విఫలమైందన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. డిసెంబరు 9వ తేదీన రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. చంద్రాయన్‌పల్లి, కోల్‌కొండ, అమ్రాదికుర్దు, మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి, టేకులపల్లి, మల్లారెడ్డిగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పాండుగౌడ్, కేపీ రాజు, బుస శ్రీకాంత్, రమేశ్, లక్ష్మారెడ్డి, రఘునాథ్ రెడ్డి, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మోదీ వేవ్ నడుస్తోంది

వికారాబాద్: దేశంలో నరేంద్ర మోదీవేవ్ నడుస్తోందని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం సాయంత్రం ప్రజా ఆశీర్వాద యాత్ర మండలంలోని పులుమద్ది, నారాయణపూర్, అత్తెల్లి, మదన్‌పల్లి, మైలార్ దేవరంపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతోందన్నారు. పార్టీ నాయకులు ఇతర పార్టీలోకి వెళ్తున్నారని తెలిపారు. యువకులంతా బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో ప్రజలు యువకులు పాల్గొన్నారు.

కదిలే కళాఖండాలు

» మదిని మైమరపించేలా విన్సెంట్ వ్యాన్గో చిత్రాలు
» 230కుపైగా చిత్రాలతో అరుదైన ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జగమెరిగిన ప్రఖ్యాత చిత్రకారుడు విన్సెంట్ వ్యాన్గో. ఆయన కుంచె నుంచి జాలువారిన ప్రతి చిత్రం ఒక అద్భుతమే. వ్యాన్గో కన్నుమూసి 130ఏళ్లు దాటినా... తాను గీసిన చిత్రాలకు నేటికి జనం జయహోలు పలుకుతున్నారంటే అతిశయోక్తి లేదు. ఆయన జీవితం ఆధారంగా తీసిన సినిమాలు, రాసిన పుస్తకాలకు కూడా అమితాదరణ లభించడం చూశాం. దటీజ్ వ్యాన్గో! ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానుల ఆరాధ్య చిత్రకారుడిగా జననీరాజనాలు అందుకుంటున్న ఈ డచ్ ఆర్టిస్టు వర్ణ చిత్రాలు ఇప్పుడు నగరం ముంగిట కొలువుదీరాయి. వినీలాకాశాన్ని చుట్టుముట్టిన నక్షత్రాలతో... చూడటానికి రెండు కళ్లు చాలవన్నట్టుండే ‘స్టారీ నైట్’ పెయింటింగ్.. మధ్యతరగతి భావోద్వేగాలకు అద్దంపట్టే ‘పొటాటో ఈటర్స్’, తన్మయత్వానికి లోనుచేసే ‘వీట్‌ఫీల్డ్’, సన్‌ఫ్లవర్, ఆల్మండ్ బ్లాసమ్స్.. ఇలా అరుదైన అద్భుత కళాఖండాలను చూడాలంటే హైటెక్స్‌లోని ‘విన్సెంట్ వ్యాన్గో ఇమ్మర్సివ్ ఎక్స్‌పీరియెన్స్’ షోకు వెళ్లాల్సిందే.



కదిలే బొమ్మలు..

కేవలం వ్యాన్గో వర్ణచిత్రాలను సాదాసీదాగా చూడటం కాదు... ప్రదర్శన లోపలికి అడుగుపెట్టగానే వ్యాన్గో జీవిత విశేషాలతో కూడిన చిత్రపటాలు మనసును కదిలిస్తాయి. కన్నీళ్లు తెప్పిస్తాయి. అది దాటి ఇన్ఫినిటీగదిలోకి వెళ్లగానే.. ఇదివరకెన్నడూ చూడని ఒక కొత్త లోకాన్ని చూస్తున్నామన్న భావన మనసొంతమవుతుంది. విద్యుత్ దీపాల ధగధగల మధ్య గది ఉపరితలంతో పాటు కిందిభాగమంతా పరుచుకొన్న ‘స్టార్రీనైట్’ వర్ణచిత్రాన్ని చూస్తుంటే... వ్యాన్గో గీసిన ఆ అపురూప చిత్రంలోని సన్నివేశాన్ని మనం ప్రత్యక్షంగా చూస్తున్నామన్నంతగా అనుభూతికి లోనవుతామనడంలో అతిశయోక్తి లేదు. ఆ తర్వాత పలకరించే ఇమ్మర్సివ్ ప్రాంగణంలో ఎదురయ్యే అనుభవం మాటలకు అందనిది! వ్యాన్గో గీసిన వాటిల్లో 236 అపురూప చిత్రాలు త్రీడీరూపంలో రూపుదిద్దుకొన్న దృశ్యకావ్యం 360డిగ్రీల కోణంలో తల ఎటుతిప్పినా.. కళ్ల ముందు కదలాడుతూ చూపరులను మైమరిచిపోయేలా చేస్తుంది. వ్యాన్గో ప్రతి చిత్రం.. అందులోని ప్రతి వ్యక్తి, వస్తువు, చెట్టు, చేమ, పక్షి, పైరు, అలలు, చెలమలు.. ప్రతిదీ కదులుతున్నట్టు చూపించడం ఒక అద్భుతం. విన్సెంట్ వ్యాన్గో స్వీయ చిత్రాలు, సన్‌ఫ్లవర్ బొమ్మలు, కేఫ్ టెర్రాస్... ఇలా ల్యాండ్‌స్కేప్, పోర్ట్రయిట్, స్టిల్‌లైఫ్ కంపొజిషన్స్ తదితర కళాఖండాలు సజీవ చిత్రాలుగా మారి గది నలుదిక్కులా గోడమీద కదిలాడుతున్న భావన సందర్శకులకు కలుగుతుంది. ఈ 3డీదృశ్యమాలిక ప్రదర్శనకు 20కే లుమెన్స్ ప్రొజెక్టర్లను వాడుతున్నట్టు ఎగ్జిబిషన్ నిర్వాహకులు చెబుతున్నారు. వ్యాన్గో చిత్రాలతో ముద్రించిన టీషర్ట్‌లు, కాఫీ కప్‌లు, కీచైన్‌లాంటి తదితర వస్తువులను సందర్శకులకు అందుబాటులో ఉంచారు.

నృసింహుడి ఆలయానికి పూర్వవైభవం!

» దాతల సహకారంతో అభివృద్ధి పనులు
» కొందుర్గు మండలం పెండ్యాల గుట్టపై బోరు మోటారు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
» ఉగాదిని పురస్కరించుకొని ఆలయ పరిసరాలు చదును
» ఉత్సవాలకు ముస్తాబవుతున్న దేవాలయం


పెండ్యాల గుట్టపై వెలసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయం

కొందుర్గు, ఏప్రిల్ 6: మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో పెండ్యాల గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం పూర్వవైభవం సంతరించుకుంటోంది. దాతలు ముందుకు వస్తుండడంతో ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఉగాదికి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కొనదుర్గాన్ని(ప్రస్తుతం కొందుర్గు) 7వ శతాబ్దంలో బాదామి చాళుక్యులు పరిపాలించారు. కొనదుర్గానికి రెండు కిలో మీటర్ల దూరంలో పెండ్యాల అనే గ్రామం ఉండేది. ఈ గ్రామంలో గుట్టపై ఉన్న ఓ రాతిబండపై చీమలు మలిచిన విగ్రహం ఉండేది. అప్పట్లో దాన్ని శ్రీ నృసింహస్వామిగా కొలిచేవారు. ఈక్రమంలో విగ్రహాన్ని గమనించిన ఓ పండితుడు చాళుక్య రాజులకు ఈ వింతను వివరించారు. దాంతో బాదామి చాళుక్యరాజులు నృసింహస్వామికి ఆ ప్రదేశంలో ఆలయం నిర్మించారు. దేవాలయానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు, నిత్యపూజలు చేసేందుకు అప్పట్లోనే 365 ఎకరాలు భూమిని దానంగా ఇవ్వగా.. ప్రస్తుతం 312 ఎకరాలు ఆలయం పేరిట ఉంది. కాగా, బాదామి చాళుక్యుల కాలంలో ఓ వెలుగు వెలిగిన ఆలయం.. ఔరంగజేబు పాలనలో ధ్వంసమైంది. దాంతో పెండ్యాల గ్రామస్తులు గ్రామాన్ని విడిచి కొనదుర్గానికి వచ్చారు. ఇక్కడే ఉత్సవ విగ్రహాలతో ఆలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నేడు పెండ్యాల గుట్ట మీద వెలసిన స్వామివారికి నిత్యపూజలు కరువయ్యాయి. కోట్ల రూపాయల విలువైన భూములున్నా.. దేవుడికి దీపం పెట్టే దిక్కు లేకుండాపోయింది. ధూప దీప, నైవేద్యాలకు నోచుకోవడం లేదు. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు మార్గం, భక్తులకు ఎలాంటి వసతులు లేకపోవడం, ఆలయం అటవీ ప్రాంతంలో ఉండడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. ప్రతీ సంవత్సరం ఉగాది, దసరాకు మండల కేంద్రంలో ఉన్న దేవాలయం నుంచి పెండ్యాల గుట్టమీద ఉన్న పాత ఆలయం వరకు ఉత్సవ విగ్రహాలను తీసుకువెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. సంవత్సరంలో రెండు రోజులు తప్పా.. మిగతా రోజులు ఆ దేవాలయానికి ఎవరూ వెళ్లేవారు కాదు. దాంతో దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది.


చదును చేసిన ఆలయ పరిసరాలు

దాతల సహకారంతో చకచకా పనులు

కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వీర్లపల్లి శంకర్‌కు ఆలయం గురించి కొందుర్గు గ్రామస్తులు వివరించారు. దాంతో వారం క్రితం ఎమ్మెల్యే సహకారంతో 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. భక్తులకు తాగునీటి వసతి కల్పించేందుకు తొమ్మిదేళ్ల క్రితం కొంతమంది దాతలు బోరు వేయించారు. కొందుర్గు గ్రామానికి చెందిన ఇద్దరు రూ.20వేలు, మండల పరిధిలోని శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన మరో దాత రూ.20వేల విరాళం అందజేయడంతో బోరుకు మోటరును అమర్చి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఉగాదికి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పాత దేవాలయంలోకి తీసుకువస్తామని ఈవో శ్రీనివాస శర్మ తెలిపారు. ఈమేరకు ఆలయ పరిసరాలను చదును చేశారు. కంప చెట్లను, రాళ్లను తొలగించినట్లు చెప్పారు. అయితే, పరిసరాలను చదును చేస్తున్న క్రమంలో దేవతామూర్తుల విగ్రహాలు బయట పడుతున్నాయని ఆయన తెలిపారు. ఏదిఏమైనా ఆలయానికి పూర్వవైభవం సంతరించుకుంటోందని మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు చేపడుతున్నాం



ఉగాదిని పురస్కరించుకొని పెండ్యాల గుట్ట మీద ఉన్న నృసింహస్వామి పాత ఆలయంలో దాతల సహకారంతో, దేవస్థానం నిధులతో ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనులు చేయిస్తున్నాం. ఉగాది తరువాత దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని, స్థపతి, ఇంజనీర్లను తీసుకొచ్చి అభివృద్ధి పనులకు సంబంధించి బడ్జెట్ అంచనా వేయిస్తాం.

\- శ్రీనివాస శర్మ, (ఈవో) ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

● షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

షాబాద్, ఏప్రిల్ 6 : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. షాబాద్ ఎంపీపీ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొదని చెప్పారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామపంచాయితీ ప్రత్యేకాధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎంపీడీవో అపర్ణ, తహసీల్దార్ అన్వర్, ఏవో వెంకటేశం, ఎంఈవో శంకర్‌రాథోడ్, వైద్యులు వరలక్ష్మీ, చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి, ఏఈలు శ్రీదివ్య, నరేందర్, శారధ, ఎపీవో వీరాసింగ్, ఎంపీఎం నర్సింహులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సృజన, పారిజాతం, హాస్టల్ వార్డన్ జ్యోతి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'జనజాతర'కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/కందుకూరు/చేవెళ్ల /కొత్తూర్/కేశంపేట/షాద్‌నగర్‌అర్బన్ ఏప్రిల్ 6 :తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన జనజాతర సభకు వివిధ మండలాలు, పట్టణాల నుంచి ఆ పార్టీ, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జీ పామెన భీంభరత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసీ బస్సుల్లో తరలి వెళ్లారు. కొత్తూర్ మున్సిపాలిటీతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బస్సులు, కార్లు, వాహనాల్లో తరలివెళ్లారు. కేశంపేట మండలం నుంచి పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్, జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు. షాద్‌నగర్ నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో వాహనాల్లో భారీగా సభకు తరలివెళ్లారు.



ఆమనగల్లు : ర్యాలీ ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్



కందుకూరు : సభకు వెళుతున్న నాయకులు



షాద్‌నగర్ : వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో..



చేవెళ్ల : సభకు తరలిన నాయకులు



కొత్తూర్ : సభకు వెళుతున్న కాంగ్రెస్ శ్రేణులు



కేశంపేట : సభకు వెళుతున్న మహిళా నేతలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు

చేవెళ్ల, ఏప్రిల్ 6 : అతివేగంగా బైక్ నడపడం వల్ల భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముడిమ్యాల్ అటవీ ప్రాంతంలో జరిగింది. చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బంజరాహిల్స్‌కు చెందిన శ్రీకాంత్, అతని భార్య మహేశ్వరి(26)తో కలిసి శుక్రవారం సాయంత్రం బైక్‌పై వికారాబాద్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ అటవీ ప్రాంతంలోకి రాగానే హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న గుంతను చూడకుండా స్పీడ్‌గా వెళ్లడంతో బైక్‌పై వెనుక మహేశ్వరి ఎగిరి రోడ్డుపై పడిపోవడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె భర్తకు స్వల్పగాయలు కావడంతో ఇద్దరిని అంబులెన్స్‌లో నగరంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మహేశ్వరి మృతి చెందగా శ్రీకాంత్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టిప్పర్‌ను కారు ఢీకొన్న ఘటనలో యువకుడు..

●మరొకరికి గాయాలు

చేవెళ్ల, ఏప్రిల్ 6 : టిప్పర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకీల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కొత్రేపల్లి గ్రామానికి చెందిన భీమ్‌రావు(25), పూడూర్ మండలం ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన రాహుల్‌రెడ్డి స్నేహితులు. వారిద్దరు కలిసి శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ వద్ద గల ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన విందుకు శుక్రవారం రాత్రి హాజరయ్యారు. విందు ముగించుకొని అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కారులో వికారాబాద్‌కు బయల్దేరారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని కొల్లూర్ గేట్ వద్ద ముందుగా వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వారి కారు టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న రాహుల్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా పక్కనే కూర్చున్న భీమ్‌రావు అక్కడిక్కడే మృతి చెందాడు. రాహుల్‌రెడ్డిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాహుల్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



ఆరుట్లలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



శంకర్‌పల్లిలో జెండావిష్కరిస్తున్న నాయకులు



ఆదిభట్లలో బీజేపీ జెండావిష్కరణ



చౌదరిగూడలో మాట్లాడుతున్న నాయకులు

మంచాల/కేశంపేట/ఆమనగల్లు/కడ్తాల్/ తలకొండపల్లి/ఆదిభట్ల/ చేవెళ్ల/ ఇబ్రహీంపట్నం/ యాచారం/ చౌదరిగూడ/ శంషాబాద్ రూరల్ : ఏప్రిల్ 6 : భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం వివిధ మండలాలు, పట్టణ కేంద్రాల్లో ఘనంగా జరిగాయి. మంచాల మండల పరిధిలోని గ్రామాల్లో ఆ పార్టీ నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించి టిఫిన్ బైటక్ నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డు ఉదయ్ నగర్ కాలనీలో కౌన్సిలర్ లక్ష్మణ్ పార్టీ జెండావిష్కరణ చేశారు. కడ్తాల మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మన్యనాయక్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి బక్కి కుమార్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. కేశంపేట మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రొల్ల రఘురాములుగౌడ్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఆదిభట్లలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శిగ వీరస్వామిగౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. శంకర్‌పల్లి మున్సిపాల్ కేంద్రంలో పార్టీ నాయకుడు ప్రభాకర్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ జెండాను ఎగురవేశారు. ఇబ్రహీంపట్నంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నిట్టు శ్రీశైలం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. యాచారంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు బాషా పార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొనేరి శ్రీనివాస్ పార్టీ జెండాను అవిష్కరించారు.



కడ్తాలలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



యాచారంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కేశంపేటలో పార్టీ జెండాకు వందనం

బీజేపీ శంకర్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు



నియామక పత్రం అందిస్తున్న రత్నం

చేవెళ్ల, ఏప్రిల్ 6 : బీజేపీ శంకర్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శిగా ఎల్లకొండ నర్సింహులు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్ ఆయనకు నియామక పత్రం అందించారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం పని చేయాలని రత్నం ఆయనకు సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ. బీర్ల నర్సింహ, నాయకులు వాసుదేవ్‌కన్నా, రమేశ్, నాగరాజుగౌడ్ ఉన్నారు.

స్వయం ఉపాధిపై ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 6 : స్వయం ఉపాధి ఉచిత శిక్షణ తరగతులను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడం కష్టమని, కావున స్వయం ఉపాధి శిక్షణ గెస్ట్ సర్వీస్, అసోసియేట్ ఆటోమొబైల్ రిపేర్, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్, డ్రై వాల్స్, అండ్ ఫాల్స్‌లింగ్ టెక్నిషియన్, వెల్డింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సులను శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఈ నెల 10వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటీ వరకు 18 వేల మంది యువతి, యువకులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగాలు కల్పించిన్నట్లు వారు చెప్పారు. వోల్వొ, టీవీఎస్, సెయింట్ గోబెన్, జిప్రాక్, హెచ్ఎంఎస్ హోస్ట్, ఫెబర్, సింధూరీ, తాజ్ , హయత్ హోటల్, మెక్ డోనాల్డ్స్, సొడెక్సో సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పది పాస్, ఫెయ్యిల్ అయిన వారు అర్హులని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ



సూర్యప్రకాష్‌కు కండువా కప్పుతున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 6 : ఫరూఖ్‌నగర్ మాజీ జడ్పీటీసీ కందివనం సూర్యప్రకాష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని కందివనం గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ సర్పంచ్, జడ్పీటీసీగా పనిచేశారు.

విద్యుత్ కోతలు ఎక్కడా లేవు

● చేవెళ్ల విద్యుత్ ఏడీఈ స్వామి

చేవెళ్ల, ఏప్రిల్ 6 : అధికారికంగా విద్యుత్ కోతలు ఎక్కడా లేవని చేవెళ్ల విద్యుత్ ఏడీఈ స్వామి, ఏఈ జానీమోయినుద్దిన్ తెలిపారు. శనివారం వారు ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రైతు నిరసన కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన వేదికకు తమ అనుమతి లేకుండానే విద్యుత్‌ను వాడారని చెప్పారు. విద్యుత్ కోసం స్తంభంపై ఉన్న వైర్‌కు అనుమతి లేకుండా వైర్ వేయడంతో ఒక్కసారిగా స్పార్క్ రావడంతో ట్రాన్స్‌ఫార్మార్ వద్ద ఫీజ్ పోయిందని చెప్పారు. వేదిక వద్ద విద్యుత్ పోయిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ మంత్రి సబితారెడ్డి ఏఈ జానీమోయినీద్దిన్‌కు ఫోన్ చేసి విద్యుత్ పోయిన విషయం చెప్పాడంతోనే తమకు తెలిసిందన్నారు. ఎలా పోయిందని తెలుసుకుని చెబుతామని ఏఈ మాజీ మంత్రికి సమాధానం ఇచ్చారని తెలిపారు. దీంతో వెంటనే విద్యుత్ లైన్‌మెన్‌తో సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేయించి విద్యుత్ సరఫరాను పునరుద్దరించామన్నారు. కానీ అధికారికంగా విద్యుత్ కోతలు మండలంలో ఎక్కడా లేవని వారు స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి

యాచారం, ఏప్రిల్ 6 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విధిగా తమ ధాన్యాన్ని విక్రయించాలని యాచారం మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ రైతులకు సూచించారు. శనివారం చింతపట్ల గ్రామంలో ఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల వ్యవధిలో వారి ఖాతాలో డబ్బు జమచేస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం పక్కా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందిరా క్రాంతి పథం ఏపీఎం సుదర్శన్‌రెడ్డి తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి జడ్పీటీసీ పరామర్శ

కేశంపేట, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి శనివారం అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల కోసం రూ. 10వేలు సహాయమందించారు. సురేష్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

●బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షలు

●కందుకూరులో ర్యాలీ



కందుకూరు : వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

కందుకూరు/మహేశ్వరం, ఏప్రిల్ 6 : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం కందుకూరు పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు స్థానిక ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మహేశ్వరం నియోజకర వర్గ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహరెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటి చైర్మన్ సురేందర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని, రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కందుకూరు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్రెడ్డి, ఎంపీటీసీలు టి.ఇందిరదేవేందర్, కాకి రాములు, లలితకుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.మహేశ్వరంలో ఎమ్మార్వోకు వినతిపత్రం ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, ప్యాక్స్ చైర్మన్ పాండుయాదవ్, డీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌అర్బన్ : కరువుభారిన పడి అల్లాడుతున్న అన్నదాతలను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం షాద్‌నగర్ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడం లేదని విమర్శించారు. పూర్తి స్థాయిలో రైతులకు పెట్టుబడి సహాయాన్ని ఇవ్వలేదని ఆరోపించారు. దీక్షలో జడ్పీ వైస్‌చైర్మన్ ఈటే గణేష్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్‌చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కేశంపేట ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్, కొత్తూర్ మున్సిపల్ చైర్మన్ బాతుక లావణ్యదేవేందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న అంజయ్యయాదవ్

స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి పల్లకీ సేవ

షాద్‌నగర్‌రూరల్, , ఏప్రిల్ 6 : షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చైడమ్మ గుట్టపై గల ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తులు ఘనంగా పల్లకి సేవ నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పల్లకిపై మోస్తూ ఆట పాటలతో ఊరేగింపు నిర్వహించారు. బాలానగర్ గ్రామానికి చెందిన నగేష్ జ్యోతి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. షాద్‌నగర్‌కు చెందిన రమేష్, రవి భక్తులకు చల్లని నీటిని అందించారు. దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీశైలంగౌడ్ సన్మానించారు. ఈ నెల 17న జరుగబోయే శ్రీరామ నవమి ఉత్సవాలకు భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసాని నర్సింలు, వసంతరావు, రఘు, రమేష్, రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

శంషాబాద్ రూరల్ : మండల పరిధి మదన్‌పల్లిలోని శనేశ్వరాలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభ మయ్యింది. ఆలయంలో శనేశ్వరస్వామికి భక్తులు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. శని త్రయోదశి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌రాజు తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాలనూ రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్



సభకు వెళ్లే ముందు విలేకరులతో మాట్లాడుతున్న కసిరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 6 : వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలనూ బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని, అది వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన కేసీఆర్ నిర్లక్ష్య ఫలితమే ప్రస్తుత విపత్కర పరిస్థితులకు కారణమని ఆయన ఆరోపించారు. పట్టణంలో శనివారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ అనితవిజయ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టక తప్పదన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్నివర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. బీజేపీ దేశంలో మత రాజకీయాలు సాగిస్తూ రాజకీయ లబ్ధికి యత్నిస్తుందని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలకు సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎం.ఏ ఖలీల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ అధ్యక్షుడు పట్టణ వస్పుల మానయ్య, నాయకులు కృష్ణనాయక్, ఖాదర్‌ఖాద్రీ, సురేశ్ నాయక్, తదితరులు ఉన్నారు.

పోలింగ్ విధులను సక్రమంగా నిర్వహించాలి

● ఎన్నికల అధికారులు ● పీవో, ఏపీవోలకు శిక్షణ



కొందుర్గు : మాట్లాడుతున్న ఏఎల్ఎంటీ రవీందర్

కొందుర్గు, ఏప్రిల్, 6 : పోలింగ్ విధులను సక్రమంగా నిర్వహించాలని ఏఎల్ఎంటీ రవీందర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ అధికారులు(ఓపిఓ)గా విధులు నిర్వహించనున్న ప్రభుత్వ ఉద్యోగులకు వారి విధులపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఓటు వేసే సమయంలో 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూయించినా ఓటు వేసేందుకు అనుమతించాలన్నారు. తహసీల్దార్ రమేష్ కుమార్, ప్రభుత్వ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కేశంపేట తహసీల్దార్ మీర్ అజాంఅలీ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఓపీఓలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ట్రైనర్లు మహేష్, శ్రీధర్‌రెడ్డి వారికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, డీఆర్‌డీఏ ఏపీఎం భగవంతు, డీటీ గీత, ఆర్ఐ నిహారిక పాల్గొన్నారు.

తలకొండపల్లి : ఎన్నికల విధుల్లో పీవోలు, ఏపీవో అలసత్వానికి తావివ్వకూడదని తహసీల్దార్ రంగారెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు పీవోలు, ఏపీవోలకు అవగాహన కల్పించారు.

యాచారం : లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు యువత, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప అన్నారు. మండల కేంద్రంలో అదనపు పోలింగ్ అధికారులకు పోలింగ్ జరిపే విధానంపై శిక్షణ ఇచ్చారు. పోస్టల్‌బ్యాలెట్‌లో ఓటు వేసిన వారు మళ్లీ ఓటు వేయకుండా చూడాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో వంద శాతం ఓట్లు పడేలా చూడాలని అందుకోసం ఓటర్లను చైతన్యం చేయాలన్నారు. శిక్షణలో వివిధ గ్రామాల ఉపాధ్యాయులు, పోలింగ్ అధికారులు, అదనపు పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఏఎల్ఎంటీ ట్రైనర్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ జగదీశ్వర్ అధ్యక్షతన ఓపిఓలకు పార్లమెంట్ ఎన్నికలో పాటించాల్సిన నియమ నిబంధనలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భారత ఎన్నికల కమిషన్ సూచించిన నియమ నిబంధనలు అధికారులు పాటించాలని చెప్పారు. అధికారులు పక్షపాతం, నిర్లక్ష్యం లేకుండా ఎన్నికల్లో విధులు నిర్వహించాలని అన్నారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.